

ప్రశాంతంగా లెక్చరర్ పోస్టుల పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్షను సజావుగా సాగింది. మొత్తం రెండు షిఫ్ట్‌ల్లో 759 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా, 414 మంది హాజరు కాగా, 345 మంది గైర్హాజరయ్యారని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం, లూథర్‌గిరిలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఉదయం 9:00 నుంచి 12:00 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్ట్‌కు 519 మంది అభ్యర్థులు నమోదు కాగా, 337 మంది హాజరై, 183 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:00 నుంచి 5:00 గంటల వరకు జరిగిన రెండో షిఫ్ట్‌కు 240 మంది అభ్యర్థుల్లో 77 మంది హాజరై, 164 మంది గైర్హాజరయ్యారన్నారు. ఆయన వెంట ఎపిపిఎస్‌సి అధికారి ఎం.జగదీష్, సహాయ చీఫ్ సూపర్వైజర్ ఎస్‌వి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు పి4 తలపోటు

- మార్గదర్శుల స్పాన్సర్ కోసం లక్ష్యాలు
- జిల్లాలో ఎంపికైన మార్గదర్శులు 1,250



ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

పేదరిక నిర్మూలన చేస్తామని ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటించిన పి4 ప్రాజెక్టు అమలు అధికారులు, ఎంకె పెళ్లి సుబ్బి చావుకొచ్చింది అనే సామెతకు దర్పణం పట్టినట్టుందనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. ఇప్పటికే జిల్లాలో 1,250 మంది మార్గదర్శులను అధికారులు గుర్తించారు. అయినప్పటికీ 'మార్గదర్శుల'ను వెతికి, వారిని పి4 కోసం ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 'మీరేం చేస్తారో తెలీదు, కచ్చితంగా మార్గదర్శులను (దాతలు) వెతికి, వారిని ఒప్పించాల్సిందేనని తీవ్ర ఒత్తిడి చేస్తోంది. ఫలితంగా అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరో వైపు అధికారులు కూడా దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడం అధికార యంత్రాంగాన్ని విస్మయానికి గురి చేస్తోంది. సూపర్ సిక్స్‌లో భాగమైన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ వంటి పథకాలు ఇప్పటికే అర్హులకు సైతం అందలేదనే విమర్శలు ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. మిగిలిన మూడు పథకాలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ చర్యను పక్కదారి పట్టించేందుకు పి 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్షిప్) అనే విధానాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించి, వారి ఆర్థికస్థితి మెరుగు పరుస్తామనే కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారు. తద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతోంది. రూ.3 లక్షల కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఆ డబ్బుతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అయితే మార్గదర్శుల పేరుతో దాతలను వెతికి పట్టుకుని ఖర్చు పెట్టించి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతుండటం ప్రతిఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అధికారులపై కలెక్టర్ల తీవ్ర ఒత్తిడితో రాష్ట్రవ్యాప్తంగా పి4 కింద మార్గదర్శులుగా ప్రభుత్వం కొందరిని ఒప్పించింది. వీరికి ఈ నెల 18న ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విందు ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఈ విందుకు హాజరయ్యారు. ఇలా ఆర్థికంగా బలంగా ఉన్నవారి జాబితాను ఇప్పటికే సిద్ధం చేసిన అధికార యంత్రాంగానికి ప్రతి జిల్లా అధికారి నుంచి మండలస్థాయి అధికారి వరకూ అందరూ మార్గదర్శులను వెతికేలా ప్రభుత్వం ఆదేశించడం అధికారులను విస్మయానికి గురి చేస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతపై ఒత్తిడి చేస్తే పని చేస్తాం కానీ, దాతలను వెతకాలంటే ఎక్కడి నుంచి తీసుకురావాలని పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి ఉండటంతో అధికారులు ఎవరి స్థాయిలో వారు దాతలను వెతికే పనిలో ఉన్నారు. అధికారులు సంప్రదించినపుడు కొందరు ఒప్పుకోకపోవడంతో అధికారులపై చిర్రుబుర్రులాడుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో పాటు అన్ని కీలక శాఖల అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దాతలను వెతకలేక డీలా పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారుల పరిస్థితి దారుణంగా తయారయ్యింది. విధి నిర్వహణలో టిడిపి నాయకుల ఒత్తిళ్ళు ఒక ఎత్తయితే.. ప్రభుత్వం పి4లో భాగంగా ప్రతి అధికారి కుటుంబం దత్తత తీసుకోవాలని చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. విధి నిర్వహణను చూసుకోవాలో, లేక ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు తిరగాలో తెలియక అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు 2029 వరకూ ఆడబిడ్డ నిధి ప్రస్తావనే లేదని ముఖ్యమంత్రి ప్రకటనతో స్పష్టమవుతోంది. ఆడబిడ్డ నిధి కింద జిల్లాలో 6,50,304 మంది అర్హులు ఉన్నారని అంచనా. నీకు రూ.15,000, నీకు రూ.18,000 అంటూ ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నేతలు పి4కు ఈ పథకాన్ని అనుసంధానం చేశామని ప్రభుత్వం చెప్పడం పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టేసినట్టు స్పష్టమవుతోంది.

సెంట్రల్ జైలు వద్ద అలజడి

ఎంపీ మిథున్ రెడ్డి తరలింపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎంపీ మిథున్ రెడ్డిని పోలీసులు స్థానిక సెంట్రల్ జైలుకు ఆదివారం రాత్రి తరలించారు. లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో ఇక్కడికి తరలించారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మిథున్ రెడ్డిని సెంట్రల్ జైలులోనికి తరలించారు. గత వైసిపి ప్రభుత్వంలో పార్టీ తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జిగా మిథున్ రెడ్డి వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఇక్కడి నాయకులతో మిథున్ రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సెంట్రల్ జైలు వద్దకు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌తో పాటు ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందంటూ మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. ఒక దశలో కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

సెంట్రల్ జైలు వద్ద మోహరించిన వైసిపి శ్రేణులు

ఎటువంటి అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ డైవర్షన్ చేయడంతో పాటు పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు చేరుకున్నాయి. సెంట్రల్ జైల్ మెయిన్ గేటు వద్ద రోప్ పార్టీలు మోహరించాయి. జైలుకు ఎదురుగావున్న ఆర్ట్స్ కాలేజీ, కుడివైపు లాలాచెరువు సెంటర్ నుంచి సెంట్రల్ జైలు మీదుగా వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఇవ్వలేదు. ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

అన్నదానాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగంగా నిర్ణయం నగరంలో ఎవరైనా దాతలు, ఎన్‌జిఒ, స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానాలు నిర్వహించాలంటే ఇకపై నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్, కమిమిషనర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు వెల్లడించారు. పేదలు, అభాగ్యులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యకార్యమని.. కానీ 48 గంటల ముందు ఆయా సచివాలయాల పరిధిలో పర్మిషన్ తీసుకోవడం ద్వారా ప్లాస్టిక్ ప్లేట్లు (సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్) నిషేధంతో పాటు ఆయా ప్రాంతాలలో ముందుగానే డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా తిన్న ప్లేట్లు రోడ్ల ప్రక్కన, సైడ్ కాల్వలలో పడవేయకుండా.. డస్ట్ బిన్‌లలో పడవేయడం ద్వారా ఆ ప్రాంతంలో పారిశుధ్యాన్ని కాపాడిన వారవుతామని తెలిపారు. ముఖ్యంగా పండుగల వేళ ఇతర ముఖ్య సాంప్రదాయక రోజులలో రోడ్ల మీద అన్నదానాలు, ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు వంటివి ప్లాస్టిక్ గ్లాసుల ద్వారా పంచడం తర్వాత ప్రజలు వాటిని రోడ్ల మీద పారవేస్తున్నారని తెలిపారు. గోదావరి గట్టు వెంబడి ప్లాట్ ఫారంపై నివసిస్తున్న అనాథలు, అభాగ్యులకు కొందరు దాతలు ప్రతిరోజు టిఫిన్లు, భోజనం సరఫరా చేస్తుంటారని.. కానీ వ్యర్థాలను అక్కడే పారవేయడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోందన్నారు. కనుక దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా వితరణ చేసే ముందు తమ వార్డు సచివాలయంలో పేరు, సంస్థ వివరాలు నమోదు చేసుకుంటే శానిటేషన్ సెక్రటరీకి సమాచారం అందుతుందని, వ్యర్థాలను వాహనం ద్వారా సేకరిస్తారని తెలిపారు. కనుక స్వచ్ఛంద సంస్థలు నగరపాలక సంస్థతో సహకరించి.. క్లీన్ రాజమహేంద్రవరంలో భాగస్వాములు కావాలని కోరారు.

ఎండుతున్న వరి చేలకు సాగునీరు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పసలపూడిలో ఎండిపోతున్న వరి చేలు పేరిట శనివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ చేలకు సాగునీరు అందజేసినట్టు రైతులు కక్కిరాల వీర వెంకట సోమేశ్వరరావు, సుంకర చిన్న, సుంకర వీర్రాజు, సుంకర రామకిషోర్, కోమట్లపల్లి వెంకటేశ్వరరావు, అల్లూరి శ్రీను, మొగళ్లపు మురళీకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యను తక్షణమే వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాశక్తికి, స్పందించి, నీరు అందేలా సహకరించిన ఇరిగేషన్ అధికారులు మండపాక, హరికృష్ణ, లాకు సూపరింటెండెంట్ విజయ్ కుమార్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

వరి చేనును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

హాలో సలోన్ అకాడమీ ప్రారంభం

రాజమహేంద్రవరం : అందం, సౌందర్యం, వస్త్రధారణలో అత్యంత ప్రజాదరణను సొంతం చేసుకున్న హాలో సలోన్ అకాడమీ ఆదివారం రాజమహేంద్రవరంలో తన కొత్త సెలూన్‌ను ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవంలో ప్రముఖ నటి తేజస్వి రావు పాల్గొన్నారు. హాలో సలోన్ అకాడమీ వ్యవస్థాపకురాలు ఈతకోట శ్రావణి, మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్ పాల్గొన్నారు.

బౌద్ధ ధమ్మ పీఠంలో నేడు వైద్య శిబిరం

ఉండ్రాజవరం : మండల కేంద్రంలోని బౌద్ధ ధమ్మ పీఠం ఆవరణలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని పీఠాధిపతి భంతే అనాలయో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు బౌద్ధ ధమ్మ పీఠం మైత్రేయ బుద్ధ విహార 9392980666, 8500768009 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో కార్మికుల నిరసన

ఐదో రోజుకు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- కొవ్వూరు

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదో రోజైనా ఆదివారం కొనసాగింది. సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్లో నినాదాలు చేస్తూ కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ కార్మికులకు గ్రాట్యుటీ, పెన్షన్, వారసులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. జిఒ 279 ఒప్పంద కాంట్రాక్టు కార్మికులుగా పని చేసిన వారందరినీ గత ప్రభుత్వం నేరుగా ఆప్కాస్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించింద న్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవస్థకు నెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడితే విజయం తప్పక సాధించి తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భూపతి రవీంద్ర, కార్యదర్శి పూజారి వాసు, కోశాధికారి కళ్యాణ్ రాజేష్ నాయకత్వం వహించారు.

కార్టూ'నిజం'

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి -కొవ్వూరు

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు లీటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన వైసిపి విస్తతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యువతను మోసం చేశారన్నారు.ఉద్యోగం ఇవ్వని పక్షంలో నెలకి రూ.3000 చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చంద్రబాబు యువతను మోసగించారన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని చెప్పి ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారని,ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకూ రూ.15000 చొప్పున అందిస్తామని నిలువునా మోసగించారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. ఎన్నికలవేళ ప్రజలను హామీల పేరుతో మోసగించారన్నారు. ఏడాది కావస్తున్నా ఏ ఒక్క హామీనీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా పబ్బం గడుపుతున్నారని చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఏడాది గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో సాధించిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గంధం శేషసాయి, పరిమి సోమరాజు, సుంకర సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సత్తి సూర్యనారాయణ రెడ్డి

మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలు లింగాల చెరువులో అక్రమంగా సాగుతున్న మట్టి తవ్వకాలపై ఆదివారం అనపర్తి మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాల చెరువుల్లో మట్టి మాఫియాపై తన పోరాటం ఆగదన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. స్థానిక ఎంఎల్‌ఎ అక్రమ సంపాదన కోసం జరుగుతున్న ఈ మట్టి దోపిడి ప్రజల ఆస్తిపై సాగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. అనంతరం ఆయన ఈ అక్రమ తవ్వకాలపై మైనింగ్ అండ్ జియాలజీ విభాగానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలకు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజల ఆస్తిని దోచుకు తింటున్న వారిని అడ్డుకునేందుకు తక్షణమే విచారణ జరిపించి, మట్టి దోపిడిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై కఠిన శిక్షలు విధించాలని, వారు దోచుకున్న ప్రజల సొమ్మును తిరిగి ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొవ్వూరులో పర్యటిస్తున్న ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు

పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి -కొవ్వూరు, గోకవరం

కొవ్వూరు మండలం ధర్మవరంలో ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. హరిదాసుల పోసిరత్నంకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.18,000 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి పాల్గొన్నారు.

గోకవరం మండలం కృష్ణునిపాలెం గోపీకృష్ణ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త తోట నరసింహం, రామ్‌జీల పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాటి రాంబాబు నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

రోటరీ క్లబ్ నిడదవోలు మిడ్ టౌన్ అధ్యక్షుడు గుబ్బల సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఇంజే శేఖర్ ఆర్థికే సాయంతో ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నిడదవోలు మండలం రావిమెట్లలో రామాలయం వద్ద ఉదయం 5 గంటల నుంచి సుగర్, బిపి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 126 మందిని పరీక్షించగా 32 మందికి సుగర్ రీడింగ్ ఎక్కువగాను, 21 మందికి బిపి రీడింగ్ ఎక్కువగాను వచ్చిన వారికి తకు జాగ్రత్తలు తెలియజేసి..తదుపరి వైద్యుల సలహాలు తీసుకోవలసిందిగా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ ఆనందం మురళీకృష్ణ, ట్రైనర్ పెచ్చెట్టి ఫణిసింహా, సభ్యులు మాదు గణపతి పాల్గొన్నారు.

వెంకమ్మ అమ్మవారికి ఆషాడం సారె

ప్రజాశక్తి-పెరవలి

మండలం అన్నవరప్పాడులో ఉన్న పద్దాల వెంకమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆడపడుచులు అమ్మవారి మేళతాళాలతో ఊరేగింపుగా ఆషాడం సారె సమర్పించారు. అనంతరం నిర్వాకులు జాకెట్, గాజులు, తీర్థ ప్రసాదాలు అందించారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-చాగల్లు

ధారవరంలో ముంపునకు గురైన పంట పొలాలను ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. రైతులకు పంట పొలాలకు నష్టం కలగకుండా, నీటి ఉధతి తగ్గించడానికి విజ్జేశ్వరం బ్యారేజ్ నుంచి నీటి విడుదల తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. విజ్జేశ్వరం బ్యారేజ్ నుంచి అప్పారావు కెనాల్ ద్వారా వచ్చిన నీరు, అధిక వర్షాలకు మండలం చాగల్లులోని రాళ్ల మడుగు నుండి వచ్చే వర్షం నీరు కలిసి ఎక్కువ నీరు విడుదల అయిన కారణంగా పంట పొలాలను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారు. బ్యారేజ్ నుండి నీటి విడుదల శాతం తగ్గించి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నాదల శ్రీరామ్ చౌదరి, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు. కొవ్వురు ఆర్‌డిఒ రాణి సుష్మిత, తహశీల్దారు ఎం.మేరీకమ్మ ముంపు పొలాలను పరిశీలించారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ వెంకటేశ్వరావు

ప్రమాణస్వీకారం చేస్తున్న వ్యవసాయ సహకార సొసైటీ కార్యవర్గం

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి -కొవ్వూరు

రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా పాలకవర్గం పని చేయాలని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పసివాదల సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార ఉత్సవం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, రుణ సదుపాయం సకాలంలో అందిస్తూ రైతులకు సొసైటీ అన్నదండగా ఉండాలని సూచించారు. నూతన పాలకవర్గం తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని టిడిపి సీనియర్ నేత, ఆంధ్రా సుగర్స్ జెఎండి పెండ్యాల అచ్యుతరామయ్య సూచించారు. గారపాటి రామచంద్రరావు అధ్యక్షునిగా, వేములపల్లి రత్న రాజేంద్ర, గోనపరెడ్డి శ్రీనివాసరావులు పర్సన్స్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావును నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంపిపి కాకర్ల నారాయుడు, కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి, వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హౌసింగ్ అధ్యక్షునిగా చక్రవర్తి నియామకం

ప్రజాశక్తి- కొవ్వూరు

ఎపి గృహ నిర్మాణ సంస్థ సహాయక ఇంజినీర్ల అసోషియేషన్ నూతన అధ్యక్షునిగా కొవ్వూరు రూరల్ ఎఇ కె.చక్రవర్తిని ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలో యుటిఎఫ్ భవనంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎఇల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. డి.మల్లిఖార్జునరావు ఆధ్వర్యాన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చక్రవర్తి తెలిపారు. సెక్రెటరీగా చిత్తూరు జిల్లాకు చెందిన ఎన్.శ్రీరాముల రెడ్డి, ట్రెజరర్‌గా కోనసీమ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్‌తో పాటు 26 జిల్లాల వారికి నూతన కార్యవర్గంలో చోటు కల్పించినట్లు చక్రవర్తి తెలిపారు.

విద్యారంగంలో ఉత్తమ సేవలకు అవార్డులు

ప్రజాశక్తి-కడియం

విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన కడియం మండలానికి చెందిన పలువురికి కాకినాడ దంటు సూర్యారావు కళా కేంద్రంలో, యంగ్ మైండ్స్ స్వచంద సంస్థ అవార్డులను అందించింది. ఎంఇఒగా విశేష సేవలు అందించిన వి.లజపతిరాయ్, వేమగిరి తోట నెంబర్ వన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.జయరాజు, ఉపాధ్యాయిని నాగమణి ఈ అవార్డులు అందుకున్నారు. ఎంఎల్‌సిలు పేరాబత్తుల రాజశేఖరం, శ్రీనివాసుల నాయుడు వీరికి అవార్డులు అందజేసారు. ఈ కార్యక్రమంలో యంగ్ మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు వాకద వెంకట రమణ, జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి మురళి సత్యనారాయణ, చక్రధర్, కెవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అవార్డులు అందుకుంటున్న ఉపాధ్యాయులు

సత్తెమ్మ తల్లి ఆలయంలో మంత్రి దుర్గేష్ పూజలు

ప్రజాశక్తి -నిడదవోలు రూరల్

తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తల్లి ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులతో చర్చించారు. సుమారు 6000 మందితో ఆలయం కిటకిటలాడింది. దాతల సహకారంతో నిడదవోలు కోట సత్తెమ్మ తల్లి హోల్‌సేల్ కూరగాయలు వర్తక సంఘం ఆధ్వర్యాన రెండు టన్నుల కూరగాయలు, పండ్లతో శాకాంబరి అమ్మవారిగా అలంకరించారు. ఆదివారం ఆలయానికి రూ.2,61,460 ఆదాయం సమకూరినట్టు సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

బోల్తా పడిన కారు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక నగర పంచాయతీ పరిధిలో బైపాస్ రోడ్డులో అదుపుతప్పి కారు బోల్తా పడింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బై పాస్ రోడ్డులోని దొమ్మేటివారిపాలెం మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున అమలాపురం నుంచి యానాం వైపు వెళుతున్న కారు అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఘటన సమయంలో కారులో డ్రైవర్ ఒక్కడే ఉన్నట్లు సమాచారం. ఘటన స్థలాన్ని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పరిశీలించారు.

లభ్యం కాని యువకుని ఆచూకీ

-గాలింపుచర్యలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

తన స్నేహితులతో వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చి గోదావరిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో యువకుడు గల్లంతైన విషయం విదితమే. అయితే 36 గంటలు పైనే కావస్తున్నా యువకుని ఆచూకీ లభ్యం కాలేదు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పామర్తి సాయి దినేష్ (22) సత్తుపల్లి వెస్ట్ మదర్ థెరిసా కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. శనివారం తన స్నేహితులతో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చి గౌతమి గోదావరి నదిలో స్నానం చేస్తుండగా సాయి దినేష్ గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం సిఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలు గోదావరి నదిలో ఆదివారం బోట్లపైన కోటిపల్లి వరకు అన్వేషించారు. అయినా సాయి దినేష్ ఆచూకీ లభ్యం కాలేదు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సారా బట్టీలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. మండలంలోని సూరయ్యపేట, బీమోలు సరిహద్దుల్లో మారు మూలగల చింతలపూడి కాలువగట్టు వెంబడి సారా కాస్తున్నారన్న సమాచారంతో దాడులు చేయగా, సారా తయారీకి ఉపయోగించే నాలుగు పీపాల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - కడియం

కడియపులంక శ్మశాన వాటిక దగ్గర ఆదివారం గంజాయి అమ్ముతున్న ఐదుగురు యువకులు, ఒక బాలుని అరెస్టు చేసినట్లు కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ బిఎన్‌డి.ప్రసాద్, సిబ్బంది వారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై, గంజాయికి అలవాటు పడి, జల్సా ఖర్చుల కోసం గంజాయి అమ్మడం, దొంగతనాలు చేయడం మొదలుపెట్టారని తెలిపారు. వారి నుండి మూడున్నర కేజీల గంజాయి, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ చేసిన ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని ఏజెన్సీ ప్రాంతమైన కెడి.పేట గ్రామం నుంచి తీసుకుని వచ్చి ఇక్కడ చిన్న చిన్న పాకెట్లుగా చేసి అమ్ముతున్నట్లు తెలిపారు.

శ్రామికులకు అండగా ఈ శ్రమ్

కార్మిక శాఖ సహాయ కమిషనర్ బిఎస్ఎం.వల్లీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఈశ్రమ్ ద్వారా అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతీ ఒక్క శ్రామికునికీ ఎంతో మేలు కలుగుతుందని కార్మిక శాఖ సహాయ కమిషనర్ బిఎస్ఎం.వల్లీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకంలో చేరితే అనేక ప్రయోజనాలున్నాయని అధికారులు కార్మికుల పని ప్రదేశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వలస కార్మికులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు ఈశ్రమ్ చక్కగా ఉపయోగపడుతుందని వివరిస్తూ అసంఘటిత రంగ కార్మికుల కోసం జిల్లాలో సర్వే నిర్వహిస్తున్నారు. దీంతో ఈశ్రమ్ వెబ్‌పోర్టల్‌లో నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో కార్మిక శాఖ సహాయ కమిషనర్ మాట్లాడారు.

ఈశ్రమ్‌తో ప్రయోజనాలు ఏమిటి..? ఇప్పటివరకూ ఎంతమందిని నమోదు చేశారు.

ఈ శ్రమ్‌లో ఇప్పటి వరకూ 3,57,396 మందిని నమోదు చేశాము. ఈ శ్రమ్‌లో చేరిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వపరంగా అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందినా, శాశ్వతంగా అంగవైకల్యం కలిగిన వారికి రూ.2లక్షల బీమా, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష బీమా ఉచితంగా అందిస్తున్నారు. ఇతర ప్రయోజనాలూ కల్పిస్తారు. ఈశ్రమ్ పోర్టల్‌లో చేరిన ప్రతీ అసంఘటిత కార్మికుడికీ 12 అంకెలు గల ప్రత్యేక గుర్తింపు కార్డు యుఏఎన్ (యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబరు) ఇస్తారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్నిరకాల సహాయం, సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలు అందుతాయి.

ఏయే రంగాలలో పనిచేసే వారు అర్హులు?

ఈ శ్రమ్‌లో నమోదుకు కార్మికులు నగదు చెల్లించనవసరం లేదు. ఉచితంగానే నమోదు ప్రక్రియ జరుగుతోంది. అసంఘటిత రంగంలో కార్మికులై ఉండి 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు లోపు వారు ఇందులో చేరవచ్చు. ఆదాయ పన్ను చెల్లించే వారు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలున్న వారు ఈ పథకానికి అనర్హులు. భవన నిర్మాణ కార్మికులు, నర్సరీ కార్మికులు, షాపుల సంస్థలలో పనిచేసే కార్మికులు, వలస కార్మికులు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, చిన్న మరియు సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, బీడీ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, తాపీ పని వారు, కూలీలు, ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులు, స్వో మిల్లు కార్మికులు, చేతివృత్తులు, హమాలీలు, వీధి వర్తకులు, ఆశా, అంగన్‌వాడీ తదితర కార్మికులంతా ఈ పథకంలో నమోదు చేసుకునేందుకు అర్హులు.

ఈ శ్రమ్‌లో కార్మికులు తమ పేర్లను ఎలా నమోదు చేసుకోవాలి?

ఈ పథకంలో నమోదుకు e-Shram portal website i.e https//register.eshram.gov.in/user-selfలో సొంతంగా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు లేదా సచివాలయాల్లోనూ సిఎస్‌సి సెంటర్లలోనూ నమోదు జరుగుతోంది. కార్మికులు తమ ఆధార్‌తో పాటు, బ్యాంకు పాసుబుక్, నామినీ ఆధార్ వెంట తీసుకెళ్లాలి. అదేవిధంగా ఆధార్‌తో లింకైన సెల్ ఫోన్ తప్పనిసరిగా తీసుకు వెళ్లాలి. ఓటిపి నంబరు నమోదు అనంతరం ప్రక్రియ పూర్తవుతుంది. అక్కడ యుఏఎన్‌తో కూడిన ఈశ్రమ్ కార్డును జారీచేస్తారు. ఆధార్‌తో లింకు ఉన్న ఫోన్ నెంబరు, బ్యాంకు అకౌంటు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. యుఏఎన్ ఉన్న ప్రతి ఒక్కరికీ పిఎంఎస్‌బివై పథకం కింద రూ.2 లక్షలు, అంగవైకల్యం బీమా ఉచితంగా అందజేస్తారు. అలాగే ఎలాంటి వివరాలు అవసరమైనా, లేదా అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

భవన నిర్మాణ కార్మికుల నమోదు ప్రక్రియ, గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ జరుగుతోందా ?

భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేకంగా నమోదు ప్రక్రియ జరుగుతోంది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996 క్రింద నమోదుకు 18 నుంచి 60 సంవత్సరములు మధ్య వయస్సు కలిగి సంవత్సరంలో 90 రోజులు భవన, ఇతర నిర్మాణ రంగంలోని 26 విభాగాలలో పనిచేసే వారంతా అర్హులే. అర్హులైన కార్మికులు దరఖాస్తు ఫారం నింపి పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, నామిని ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ జతపర్చి నమోదు చేసుకోవాలి. నమోదుకు రూ.50, ప్రతి ఏటా రెన్యువల్‌కు రూ.12 చొప్పున చెల్లించాలి. ఈ గుర్తింపు కార్డుల ద్వారా ప్రమాద బీమాతో పాటు మహిళల ప్రసూతికి ప్రభుత్వం నగదు సహాయం అందజేస్తోంది.

బ్లాస్టింగ్‌లో గాయపడిన వారికి పరామర్శ

ప్రజాశక్తి - తుని

పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో కొండను బ్లాస్టింగ్ చేసే క్రమంలో శనివారం కొండ రాళ్లు పడి గాయపడిన ఇద్దరు మహిళలను మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులు చేపడుతున్న గుత్తేదారులు కనీస భద్రత పాటించడం లేదని, కొండలను పేల్చే సమయంలో స్థానికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం సరైన విధానం కాదన్నారు. ఇటువంటి సంఘటన పునరావృతం అవ్వకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. దంసమైన ప్రహరీ గోడను నిర్మించి గాయపడిన ఉగాది సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో వైసిపి నేత యనమల కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. లయన్స్ అధ్యక్షులుగా కంటే ఉదయ్‌భాస్కర్‌చౌదరి, కార్యదర్శిగా వెంపాటి రామారావు, ట్రెజరర్‌గా కొత్త కృష్ణచైతన్య ఎన్నికయ్యారు. వీరిని ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాసు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు గోలి శ్రీరాములు, కోడూరి రంగారావు, ఆర్‌సి పి.గంగాధరరావు, పాస్ట్ ప్రెసిడెంట్ ఎంఎస్‌బి. గంగాధరరావు, కార్యదర్శి ఎం.పద్మావతి, ట్రెజరర్ సిహెచ్.జగ్గారావు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఉదయ్‌భాస్కర్‌ను ఆయన టెన్త్ క్లాస్ స్నేహితులు శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

మహేశ్వరరావుకు పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రకృతి వైద్య సేవలు అందిస్తున్న ఒంటిమామిడి కెవికె. మహేశ్వరరావుకు సంప్రదాయ ప్రకృతి వైద్యుల పురస్కారం లభించింది. ఆదివారం దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఈ అవార్డును ఎంఎల్‌సిలు పేరాబత్తుల రాజశేఖర్, జి.శ్రీనివాసులనాయుడు, సంస్థ ఛైర్మన్ వాకడ వెంకటరమణ చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సిలు మాట్లాడుతూ మహేశ్వరరావు పదేళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో వేలాది మందికి ప్రకృతి వైద్యం ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వైద్యం మన సంపదని, దీనిని భవిష్యత్ తరాలకు అందిస్తూనే కొత్త ఆవిష్కరణలతో ముందుకు తీసుకెళ్తానన్నారు.

CHANGE OF NAME

I, **LUKE JULEAT LATHA,** W/o. Seelam Prasad, D.No. 2-44-9, RCM Church, Alcot Gardens, ILTD Junction, Rajamahendravaram, E.G. Distrct, A.P., Pin: 533101, I have changed my name from **SEELAM JULEAT LATHA** (Old Name) to **LUKE JULEAT LATHA** (New Name). Hence forth Iam being called **LUKE JULEAT LATHA,** W/o. Seelam Prasad, for all purpose.

CHANGE OF NAME

I, **MIRTHIPATI KANAKA VENKATA LAKSHMI PAVANI,** W/o. Mirthipati Venkata Srinivasu, D.No. 60-8-1, Satyeswari Nilayam, P&T Colony, 2nd Street, Raja Theatre, Rajamahendravaram, E.G. Distrct, A.P., Pin: 533105, I have changed my name from **PALAKURTHI PAVANI** (Old Name) to **MIRTHIPATI KANAKA VENKATA LAKSHMI PAVANI** (New Name). Hence forth Iam being called **MIRTHIPATI KANAKA VENKATA LAKSHMI PAVANI,** W/o. Mirthipati Venkata Srinivasu, for all purpose.

జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతర ఉత్సవానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు పోటెత్తారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది క్యూలైన్‌లను పర్యవేక్షించారు. క్యూలైన్లలో ఉన్న యాత్రికులకు తాగునీరు, పిల్లలు, వృద్ధులకు పాలు పంపిణీ చేశారు. యాత్రికులు అధికంగా రావడంతో సిఐ జయశంకర్, ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. జాతరకు వచ్చిన యాత్రికులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఫలహారాన్ని పంపిణీ చేశారు. పిల్లలకు, వృద్ధులకు పాలును అంద జేశారు. సామర్లకోట లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పులిహార, ఆహార పదార్థాలు, మంచినీరు పంపిణీ చేశారు. కొన్ని సంస్థలు అన్నదానం నిర్వహిం చాయి. పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫలహారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కట్టా రాజబాబు, కొల్లి వెంకటేశ్వర్లు, దెందులూరు స్వామి, కొండేటి వీరభద్రరావు, మొండి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

మరిడమ్మ జాతరలో భాగంగా నివాస ప్రాంతాల ప్రజలు నిర్వహించే సంబరాలు స్థానిక కొత్తపేట, పాశీల వారి వీధి ప్రజలు ఘనంగా నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన్న రాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానపద, పౌరాణిక కళారూపాలు, విద్యుత్ దీపాలంకరణలు, బండ్ల వేసాలు ఆకట్టుకున్నాయి. పెద్దపులాటలు, కాళికా, గరగలు, తప్పెటగుళ్ల నృత్యాలు, కోయ డాన్సులు, విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరి రాజు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న యాత్రికులు

బండ్ల వేషాలతో ఆకట్టుకున్న కళాకారులు

నృత్యం చేస్తున్న తప్పెడగుళ్ల కళాకారులు

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనుబంధ సంస్థ సిఐటియు పిలుపు మేరకు నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె ఎనిమిదవ రోజైన ఆదివారం కొనసాగింది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ.నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని,షరతులు లేకుండా ఇంజినీరింగ్,పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని,కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో జరిగిన ఒప్పంద హామీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు చెయ్యేరు గున్నేపల్లి సర్పంచ్ గోలకోటి దొరబాబు మద్దతు తెలిపారు. ఈ శిబిరంలో ఎస్.అజయ్ కుమార్, ఎస్.అరుణ్ కుమార్, జి.రమేష్, శ్రీనివాసరావు, వైవి.రమణ, ఎ.సత్తిబాబు, వై.ప్రసాద్, ఎస్. రామరాజు, జి.వెంకటేశ్వరరావు, కె .శివ పాల్గొన్నారు.

విద్యుత్ తీగల సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలంటూ వానపల్లిపాలెం పంచాయతీ బివి.రమణయ్య నగర్ దళిత గ్రామస్తులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. గ్రామస్తులు నివసించే ప్రాంతంలో సుమారు 15 రోజుల క్రితం వరి చేల్లో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం తుప్పు పట్టి పడిపోయిందన్నారు. విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు సిబ్బందికి తెలియపరచామన్నారు. దీంతో విద్యుత్ సిబ్బంది పడిపోయిన విద్యుత్ స్తంభం ఆనంలో చిన్న కర్రను పాతి దానికి విద్యుత్ 11 కెవి మెయిన్ లైన్ సర్వీస్ వైర్లను కట్టి వెళ్లిపోయారన్నారు. అంతే తప్ప పడిపోయిన స్తంభం స్థానంలో మరో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయలేదన్నారు. వర్షం వచ్చినా గాలి వీచినా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై ఇంటిలోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కాలి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి చేతికందే ఎత్తులో 11 కెవి విద్యుత్ వైర్లను వేలాడదీయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నామన్నారు. మనిషికి తగిలే ఎత్తులో 11 కెవి విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో ప్రజలకు పశువులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నన్ను ఆందోళనతో కాలం గడుపుతున్నామని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు చొరవ తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంగాధర్‌కు 'యంగ్ మైండ్స్' అవార్డు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పెదబ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ 'యంగ్ మైండ్స్' అవార్డును అందుకున్నారు. ఆదివారం యంగ్ మైండ్స్ - రేపటి కోసం ప్రథమ వార్షికోత్సవ వేడుక కాకినాడ యంగ్ మెన్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు పేరాబత్తుల రాజశేఖర్, గాదె శ్రీనివాసుల నాయుడు చేతులు మీదుగా గంగాధర్ యంగ్ మైండ్స్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ చిన్న, వెన్నపు చక్రధరరావు, టిడిపి నాయకులు యేసుదాసు తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీత గంగాధర్ మాట్లాడుతూ ప్రతీ పుట్టిన రోజున మొక్కలు నాటి పెంచడమే కాకుండా తన బంధు, మిత్రుల పుట్టిన రోజున కూడా వారిని మొక్కలు నాటేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి, గ్రామంలో వైద్యశిబిరాలు, విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కిందని అన్నారు.

అవార్డు అందుకుంటున్న తోటకూర గంగాధర్

ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్

ప్రజాశక్తి - కాజులూరు

ప్రమాదాలను నివారించేందుకే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం కోలంక శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రధానంగా యువత శని, ఆదివారాల్లో రాజమహేంద్రవరం, మండపేట, తాడేపల్లిగూడెం వంటి సుధీర ప్రాంతాల నుంచి వచ్చి యానాం వస్తున్నారని అన్నారు. మద్యం తక్కువ ధరకు లభించడంతో మద్యాన్ని పరిమితికి మించి సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించడానికి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మద్యం సేవించిన వారి నుంచి జరిమానా విధించడం, లేదా న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ ఎ.కృష్ణభగవాన్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఒక్కొక్కరితో మాట్లాడి వారిపై ఎన్ని కేసులు ఉన్నది, వాటి తీవ్రత, కుటుంబ నేపథ్యం, వారికి గల దురలవాట్లు వంటి వాటిపై ఆరా తీశారు. శాంతి భద్రతలకు విఘాతము కల్పిస్తే, ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిరంత నిఘా కొనసాగుతుందని, ఈ విషయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ కృష్ణభగవాన్

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కాట్రేనికోన

సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గ్రంధి నాగేశ్వరరావు ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసిపి మండల అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన పొన్నాడ మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కానీ సూపర్ సిక్స్ పథకాలను ఎన్నికల్లో ప్రచారం చేసి వాటిని అమలు చేయకుండా సంవత్సరకాలం మోసాలతో కాలం గడిపిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యకర్తలు గ్రామాలలో ప్రజలను చైతన్య పరచాలని, చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాజులూరు ఎంపిపి ఎం.మురళి, పితాని బాలకృష్ణ, ఏడిద చక్రపాణిరావు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షునిగా రవికుమార్

ప్రజాశక్తి -కాట్రేనికోన

కుండలేశ్వరం సొసైటీ అధ్యక్షుని గా గంగుమల్ల రవికుమార్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని రవికుమారును అభినందించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కష్టపడి పనిచేసిన వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ ఓగూరు భాగ్యశ్రీ, పిఎస్ఎన్ రాజు, టి.నాగేంద్ర, ఆకాశం శ్రీనివాస్, దాట్ల పవన్, గంగుమల్ల భద్రరావు, మోకా బాల ప్రసాద్, పిఎసిఎస్ సిఇఒలు రామచంద్రరావు, రామకృష్ణంరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

అయినవిల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి - అయినవిల్లి

అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రజలకు అయినవిల్లి మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది ఈ వర్షంతో వీధి కాలువలు రోడ్లు జలమయంగా మారాయి. భారీ వర్షానికి రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్యను వెంటనే పరిష్కరించి, జీతాలు చెల్లించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్ర కుమార్, ఎంటివి ఎఎస్.సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక అమలాపురం యుటిఎఫ్ హోమ్‌లో జరిగిన జిల్లా కార్యవర్గం సమావేశంలో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల బదిలీలు జరిగి ఇప్పటికీ రెండు నెలల కాలం పూర్తి కావస్తున్న, బదిలీ అయిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్య పరిష్కారం కాలేదని, దీనివలన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదని తెలియజేశారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, ఉపాధ్యాయులకు రెండు నెలల జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్ సొమ్ములు ఇప్పటికీ చెల్లించ లేదని, నిధులు విడుదల చేసి వెంటనే ఉపాధ్యాయులకు చెల్లించాలని కోరారు. పి -4 రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్బంధంగా కాకుండా, స్వచ్ఛందంగా నిర్వహించేలా ఉండాలని కోరారు. పాఠశాలల్లో ఆన్లైన్ వర్కులు, యాప్ ల పని భారం తగ్గించి, ఉపాధ్యాయులపై పని ఒత్తిడి లేకుండా చేయాలని, ఉపాధ్యాయులను కేవలం పాఠాలు బోధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆప్షనల్ హాలిడే (ఒహెచ్) వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పిఎసిఎస్ ఛైర్మన్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన నాగిరెడ్డి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన 2001లో చెముడులంక ఎంపిటిసి సభ్యునిగా టిడిపి నుంచి గెలుపొందారు. అలాగే మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా ఆ కాలంలో పనిచేశారు. ఈ పిఎసిఎస్ పరిధిలో చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక గ్రామాలకు చెంది ఉంది. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస రావుకు, కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE, KAKINADA
E.A. No.45/2025, E.P.No.297/2024 in O.S. No.732/2020

Between:
Yekkala Naga Venkata Satyanarayana ...Claim Petitioner
and
1) **Penkey Durga Prasada Rao** (DHr)
2) **Chintapalli Venkata Lakshmi** (1st JDr)
3) **Chintapalli Satyanarayana** (2nd JDr)
...Respondents

To:
2) **Chintapalli Venkata Lakshmi**, W/o. Satyanarayana, Hindu, Housewife, D.No.69-6A-5 Somalamma Veedhi, Kotha Gaigolupadu, Kakinada.
3) **Chintapalli Satyanarayana**, S/o. (Late) Satyam, HIndu, Business, D.No.69-6A-5 Somalamma Veedhi, Kotha Gaigolupadu, Kakinada.

పై నెంబరు E.A.లో 2వ మరియు 3వ JDRs/ Respondents అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**28-07-2025** తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై E.A. మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
G.S.ప్రభాకరరావు, G.V.లక్ష్మి
అడ్వకేట్స్, డో.నెం.67-1-43/3, అశోక్‌నగర్ కాకినాడ, సెల్: 9441712729

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా
Creditor I.P.No.20/2025

Between:
Vanka Chandrasekhar ...**Petitioner**
And
1. Pachipulusu Rambabu s/o.Late Bala Subbayya, Hindu, aged 51 years, Business, D.No.5-65, Rajanagaram-533294, Raja nagaram Mandal, E.G.Dt.
2. Samudrala Venkateswara Rao S/o. Late Ramayya, aged 76 yeasrs, Business, D.No.5-50, Main Road, Rajanagram-533294, Rajanagaram Mandal, E.G.Dt., PJCJC, RJY, Rajanagaram Mandal, E.G.Dt.
...1,2,Respondents

పై గ్రంధములో 1వ ప్రతివాది, 2వ ప్రతివాదికి వ్రాసి ఇచ్చిన క్రయ దస్తావేజు **నెం.2356/2025 ది.19-03-2025** యస్.ఆర్.ఒ. రాజానగరం లో రిజిష్ట్రరు కాబడిన సదరు దస్తావేజు చెల్లదని మరియు 1వ ప్రతివాదిని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని పిటిషనర్ పై కోర్టులో గ్రంధము దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా పై గ్రంధములో ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 05-08-2025** తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం **10.30** గం॥లకు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనిచో కోర్టు చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకొందురు.

(By Order of Court)
V.J.K.S.రావు
అడ్వకేట్, రాజమండ్రి
సెల్:9347273597

పేపర్ పబ్లికేషన్
మహారాజ శ్రీ ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి cum జుడీష్యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రామచంద్రపురం
IA No.759/2024 in OS.No.430/2024

Between:-
పితల శ్రీనివాస్ యాదవ్ **...పిటిషనర్/వాధి**
And
కొర్ల దుర్గా రావు **...రెస్పోండెంట్/ప్రతివాది**
Hearing Date 01-08-2025

ప్రతివాది చిరునామా
కొర్ల దుర్గా రావు తండ్రి కొర్ల సత్యనారాయణ, D.No.1-63/3, అరికిరేవుల గ్రామం,బిక్కవోలు మండలము, తూర్పు గోదావరి జిల్లా.

అను మీ పైన పై కోర్టు నందు **IA No.759/2024 in OS.No.430/2024** దాకలు అయినందున పై కోర్టు వారు నోటీస్‌లు పంపినను తీసుకొనకుండా వుండట వలన గౌరవ శ్రీ కోర్ట్ వారు ఆర్డర్ ప్రకారము దావా వాయిదా దివి **01 -08 -2025** సం॥తేదీన అయివున్నది. ఆరోజున మీరు ఉదయము **10-30** లగాయతు కోర్ట్ వారు యెదుట హాజరు కావలెను, లేని యెడల పరోక్ష మందు తీర్మానించ బడునుఅని తెలియ చేయడమయినది.

గుబ్బల శ్రీనివాస్
కుడుపూడి కిరణ్ శ్రీనివాస్,
న్యాయవాదులు,
గుబ్బలవారిపేట, రామచంద్రపురం,
Dr.B.R.A.కోనసీమ జిల్లా
సెల్:8125452224,7386002501

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమిషన్ - విజయవాడ
ఎఫ్.ఎ.నెం.250 ఆఫ్ 2024 సి.సి. నెం.46 ఆఫ్ 2023
(తేది: 29-02-2024న రాజమహేంద్రవరం వద్ద తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఫైల్‌లో)

బిట్వీన్ :
ఒకినావా ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్,రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేట్ ఆఫీస్, యూనిట్ నెం. 651-654, 6వ అంతస్తు, జె.ఎం.డి మెగాపోలీస్ సెక్టార్ 48, సహాన్ రోడ్, గుర్గావ్ హర్యానా ఇండియా- 122018.
.....పిటిషనర్/అప్పిలెంట్

మరియు :
శ్రీ లక్ష్మీ గాయత్రి మోటార్స్ మరియు ఇతరులు
....రెస్పాండెంట్

టు,
ఆర్-3: శ్రీ లక్ష్మీ గాయత్రి మోటార్స్, దాని యజమాని ప్రతినిధి, డోర్ నెం.45-22-11/1, వార్డ్ నెం.26A, బైపాస్ రోడ్, తాడితోట, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.

గౌరవ కమిషనర్ వారి అనుమతితో తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన అప్పీల్‌లలో అప్పిలెంట్ సి.సి.నెం: 46 అఫ్ 2023 అప్పీల్ దాఖలు చేసివున్నారు, మీకు పలుమార్లు నోటీసు పంపినప్పటికీ మీరు హాజరు కావడంలేదు. సదరు కమిషనర్ వారి ఉత్తరువుల మేరకు, **తే 04-08-2025దిన వాయిదా ఉన్నది. మీరు ఉ॥10.30గం॥లకు హాజరు కాగలరు.** మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. మీరు కానీ మీతరపున న్యాయవాది ద్వారా కానీ పైన తెలిపిన వాయిదా నాడు గౌరవ కమిషనర్ ఎదుట హాజరుకావలెను.

అప్పీల్ వాయిదా : 04-08-2025

జాగర్లపూడి వెంకటేశ్వర ప్రసాద్
జాగర్లపూడి లక్ష్మి శివనారాయణ
న్యాయవాదులు,
41 -5 -16 పాత పోలీస్ స్టేషన్ రోడ్, కృష్ణలంక, విజయవాడ, ఫోన్: 9440696216.